# విద్యార్థుల పాలిట వరం ఐఐటీ

- భువనేశ్వర్ ఐఐటీని జాతికి అంకితం చేయనున్న ప్రధాని
- రేపు రాష్ట్రానికి విచ్చేయనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి చర్యలు
- బరంపురం ఐజర్ సొంత భవనం నిర్మాణానికి శంకుస్థాపన


ప్రధానమంత్రి నరేంద్ర మోదీ


కాంతులీనుతున్న ఐఐటీ పాలక భవనం


ఐరోపా ప్రతినిధులతో ఐఐటీ డైరెక్టర్ ఆర్‌వీ రాజకుమార్ సమావేశం

**భువనేశ్వర్:** స్థానిక భారతీయ సాంకేతిక విద్యా సంస్థ–ఐఐటీ, బరంపురం భారతీయ వైజ్ఞానిక విద్య పరిశోధన సంస్థ–ఐజర్ చరిత్రలో నిలిచిపోయే అద్భుత క్షణాలకు చేరువకానున్నాయి. సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐఐటీ–భువనేశ్వర్‌ను జాతికి అంకితం చేయనున్నారు. అదే సమయంలో బరంపురంలోని ఐజర్ సంస్థ సొంత భవనం నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు చారిత్రాత్మక ఘట్టాలు ఒకే వేదిక నుంచి చోటు చేసుకుంటుండడం శుభపరిణామం. అయితే స్థానిక ఐఐటీ ప్రాంగణం నుంచి బరంపురం ఐజర్ సంస్థ శంకుస్థాపన పనులను రిమోట్ చీద్వారా ప్రధాని మోదీ చేయనున్నారు. సృజనాత్మక విజ్ఞాన ప్రయోగంతో సమగ్ర జీవరాశికి అనుకూలమైన సదుపాయాలను అందించే ఇంజినీరింగ్, వైజ్ఞానిక నిపుణులను ఆవిష్కరించడమే వీటి ప్రధాన ధ్యేయమని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌వీ రాజకుమార్, ఐజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీఆర్ చారి తెలిపారు.

## ప్రధాని పర్యటన షెడ్యూల్ ఇదే..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి డిసెంబర్ 24వ తేదీన విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే మొదట స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం ప్రధాని చేరుకుంటారు. అదే రోజు రోడ్డు మార్గంలో మధ్యాహ్నం 1.40 గంటలకు స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ ఐఐటీ ప్రాంగణానికి చేరుకుంటారు. ఇదే ప్రాంగణం నుంచి పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఇక్కడ జరిగే కార్యక్రమంలో దాదాపు 1 గంటసేపు ప్రధాని ఉంటారని అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. మధ్యాహ్నం 1.40 గంటల నుంచి 2.20 గంటల వరకు జరిగే ఆయా అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, వీడియో కాన్ఫరెన్సు ద్వారా పలు ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఆయా కార్యక్రమాలను ముగించుకున్న అనంతరం స్థానిక నేషనల్ ఇనిస్టిట్యూటు ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి, నైజరు స్టేడియానికి మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 3.15 గంటలకు స్టేడియంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో న్యూఢిల్లీకి తిరిగి పయనమవుతారు.

### జాతికే గర్వకారణంగా ఐఐటీ

ఖరగ్‌పూర్ ఐఐటీ ఆశ్రయ కేంద్రంగా జూలై 22, 2008వ సంవత్సరంలో భువనేశ్వర్ ఐఐటీ ఆవిర్భవించింది. సరిగ్గా ఒక ఏడాది తర్వాత ఖరగ్‌పూర్‌లో ఉన్న ఐఐటీని భువనేశ్వర్‌కు తరలించారు. అయితే జూలై 22, 2009 నుంచి భువనేశ్వర్‌లోని ఐఐటీ కార్యచరణ ప్రారంభమైంది.

### సాకారం దిశగా సొంత భవనం


భువనేశ్వర్ ఐఐటీ సొంత భవనం నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖుర్దా జిల్లాలోని జట్నీ శివారులో ఉన్న అరుగుల్ ప్రాంతంలో 936 ఎకరాల సువిశాల స్థలం కేటాయించింది. భూమి, సముద్రం, వాతావరణ పరిశోధనల కోసం ఒక ప్రత్యేక కేంద్రం ఏర్పాటు కోసం పూరీ–కోణార్క్ తీర ప్రాంతంలో దాదాపు 75 ఎకరాల స్థలాన్ని కూడా ప్రభుత్వం కేటాయించింది. అదే స్థలంలో పరిశోధనా కేంద్రం శంకుస్థాపన పనులు కూడా 12 ఫిబ్రవరి, 2009లో జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో సొంత భవనం నిర్మాణం కోసం 2011లో భూమి పూజ కూడా చేసేశారు.

### శాఖోపశాఖలుగా బోధన

సాంకేతిక పరిజ్ఞానానికి పునాది వేసే పలు అనుబంధ విషయాల్లో విద్యార్థులకు మెలకువలు నేర్పేందుకు బేసిక్ సైన్స్, ఎలక్ట్రికల్ సైన్స్, హ్యూమానిటీస్–సోషల్ సైన్సెస్–మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెకానికల్ సైన్సెస్ విభాగాల్లో ప్రత్యేక బోధన ద్వారా ఐఐటీ విద్యార్థులకు బోధన కొనసాగుతుంది.

### విపత్తు నియంత్రణకు బోధన

సుదూర కోస్తా తీర ప్రాంతంలో ప్రతి ఏటా ఏర్పడుతున్న ప్రకృతి విపత్తులతో రాష్ట్రం అల్లాడిపోతోంది. వరదలు, తుఫాన్‌ల కారణంగా ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర కరువును చవిచూస్తున్నారు. అయితే ప్రకృతి విపత్తుల నుంచి బయట పడేందుకు ఐఐటీ, భువనేశ్వర్ రెండు ప్రత్యేక పాఠశాలలను నిర్వహిస్తున్నారు. వాతావరణ విపత్తు సంకేతాలను వైజ్ఞానిక పరిజ్ఞానంతో సాంకేతిక నైపుణ్యతను జోడించి వాతావరణంలో జరిగే మార్పులను విశ్లేషించడం వంటి విషయాలను ఆయా పాఠశాలల్లో విద్యార్థులు నేర్చుకుంటారు.


ప్రొఫెసరు ఆర్‌వీ రాజకుమార్


ఐఐటీ డీన్ ఆర్‌కే పండా


ఐజర్ డైరెక్టర్ కేవీఆర్ చారి

### ప్రపంచ పరిజ్ఞానంతో ...

ప్రపంచంలోనే పేరొందిన విశ్వ విద్యాలయాలతో భువనేశ్వర్ ఐఐటీ, పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంది. స్వల్ప వ్యవధిలోనే పరిశోధనాభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగంలో విద్యార్థులకు విశ్వస్థాయి బోధన అందించి విశేష గుర్తింపు తెచ్చుకుంది. ఈ ఏడాది పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నిర్వహించిన విశ్లేషణ నేపథ్యంలో భువనేశ్వర్ ఐఐటీ ఉన్నత గుర్తింపు సాధించిందని డైరెక్టర్ ఆర్‌వీ రాజకుమార్ తెలిపారు.

### నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్స్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్)

–2018 భువనేశ్వర్ ఐఐటీలోని ఇంజినీరింగ్ విభాగానికి 18వ స్థానం లభించిందని ప్రొఫెసర్ ఆర్‌కే పండా తెలిపారు. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో కూడా స్థానిక ఐఐటీకి 21వ ర్యాంకు లభించింది. సెప్టెంబర్, 2018లో టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఈ సంస్థకు 10వ ర్యాంకు కేటాయించిన సంగతి విదితమే. అలాగే ప్రభుత్వ కళాశాల వర్గంలో స్థానిక ఐఐటీ 10వ స్థానంలో కొనసాగుతున్నట్లు ఇండియా టుడే సంస్థ ప్రకటించింది.

### 2021 నాటికి సొంత భవనం

ఆధునిక వైజ్ఞానికతను విద్యార్థులకు అందించడమే ధ్యేయంగా బరంపురం ఐజర్ స్థాపన జరిగింది. వాతావరణంలో ఆకస్మికంగా చోటు చేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో అత్యాధునిక వైజ్ఞానిక పరిజ్ఞానం అనివార్యమైంది. ఈ నేపథ్యంలో విద్యార్థి దశ నుంచే వైజ్ఞానిక పరిశోధన పట్ల మక్కువ పెంచుకోవాలని కేంద్ర మానవ వనరుల విభాగం భావించి, దేశ వ్యాప్తంగా సుమారు 7 భారతీయ వైజ్ఞానిక విద్య, పరిశోధన సంస్థ (ఐజర్)లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2016వ సంవత్సరంలో 7వ ఐజర్‌ను బరంపురం (లౌడిగాంవ్)లో ఏర్పాటు చేశారు. అయితే ఈ సంస్థ సొంత భవనం నిర్మాణానికి ప్రధాని మోదీ డిసెంబర్ 24వ తేదీన శంకుస్థాపన చేస్తారు. సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,582.78 కోట్ల వ్యయంతో బరంపురం ఐజర్ సొంత భవనం నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. గంజాం జిల్లాలోని బరంపురం నగరు శివారులో ఉన్న లౌడిగాంవ్ ప్రాంతంలో ఈ ఐజర్ సొంత భవన సముదాయం నిర్మాణం జరుగుతుంది. అయితే ఈ నిర్మాణ పనులను డిసెంబర్, 2021 నాటికి పూర్తి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

### వ్యూహాత్మకంగా ముందుకు..

ఆధునిక పద్ధతుల్లో సమస్యలను పరిష్కరించుకునేలా ఉజ్వల విద్యావేత్తలను తయారు చేసేందుకే బరంపురం ఐజర్ ముందుకు సాగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఏటా సుమారు 200 మంది బీఎస్–ఎమ్ఎస్ ఉత్తీర్ణులైన సుమారు 100 మందిని అంతర్జాతీయ పరిశోధకులను తీర్చిదిద్దేందుకు బరంపురం ఐజర్ కార్యాచరణ ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

### ప్రధాని ప్రారంభించనున్న కార్యక్రమాలు

- కొత్త పోస్టల్ స్టాంప్ ఆవిష్కరణ
- చారిత్రాత్మక పాయికా విప్లవం (1817) 200 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రూ.200 నాణెం ఆవిష్కరణ
- పాయికా విప్లవం స్మృతిగా ఉత్కళ విశ్వ విద్యాలయంలో ప్రత్యేక చైర్ ప్రారంభం
- ఐఐటీ, భువనేశ్వర్ కొత్త భవన సముదాయం ప్రారంభం
- బరంపురం భారతీయ వైజ్ఞానిక విద్య పరిశోధన సంస్థ, ఐజర్ సొంత భవనం నిర్మాణానికి శంకుస్థాపన
- పారాదీప్–హైదరాబాద్ మధ్య గ్యాస్ పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన
- అంగుల్–బొకారొ గ్యాస్ పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన
- భువనేశ్వర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో 50 పడకల వార్డు ప్రారంభం



ఐఐటీ ప్రాంగణం


ఐఐటీ పరిశోధనాగారం